కథానిక:

# గార్డియన్ ఏంజిల్

ఊరికి మధ్యన ఉన్న ఆ శిలా విగ్రహాన్ని చూడగానే ఎవరైనా సరే అలా నిలబడిపోతారు. ఆ విగ్రహంలో జీవం ఉట్టిపడుతుంది. అది మనకెంతో ధైర్యాన్నీ, ధీమానీ కలిగిస్తుంది. అది రవీంద్ర విగ్రహం అంటారు. కొందరు దానికి రోజూ పూజలు చేస్తారు.

దెయ్యాన్నో, భూతాన్నో చూసి జడుసుకున్న పిల్లలకి ఆ విగ్రహం చూపించి ధైర్యం చెబుతారు. చూడు రవీంద్ర మామయ్యని, ఆ మామయ్య ఉండగా నీకెందుకు భయం. మామయ్య ఎంత గొప్పవాడో తెలుసా? బ్రతికినన్నాళ్ళూ శత్రువులతో పోరాడాడు. శత్రువులకి చిక్కకుండా చచ్చిపోయాడు. అలాటి వీరుడు ఒదిలిన చివరి శ్వాస ఈ గాల్లోనే ఉంది. అది నిన్ను దయ్యాల్నించీ భూతాల్నించీ కాపాడుతుంది. అప్పుడు ఆ పిల్లలు ఆ విగ్రహం కేసి చూస్తే "నేనుండగా మీకేం భయం" అని భరోసా ఇస్తున్నట్టు కనిపిస్తుంది.


నిజానికి రవీంద్ర ఆ విగ్రహంలా ఆజానుబాహువు కాదు. అతన్ని ఆ ఊళ్ళోవాళ్ళు మొదటిసారి చూసినప్పుడు అతను కాలవలో కొట్టుకొచ్చాడు. అతని ఒంటిమీద స్పృహ లేదు.

నాట్లు వేస్తున్న ఆడ కూలీలు మధ్యాహ్నంపూట మంచినీళ్ళు తాగడానికని కాలవ దగ్గర కొచ్చి కాలవలో నీళ్ళు ముంచుతుండగా నీళ్ళు ఎర్రగా కనిపించేయి. ఎండకి కళ్ళు చెదిరాయేమోనని నీళ్ళని పరీక్షగా చూశారు. సందేహం లేదు. నీళ్ళు ఎర్రగానే ఉన్నాయి. "ఏంటబ్బా ఇది" అని ఆశ్చర్యపోయేరు. కాలవని నిశితంగా చూశారు. కాలవ ఒడ్డున పెరిగిన రెల్లుదుబ్బల మీద ఎవరిదో గళ్ళచొక్కా కనిపించింది. ఆ చొక్కా మీద రక్తపు మరకలున్నాయి. రెల్లుదుబ్బల మీద నుంచి రక్తం కారుతోంది. అది చూడగానే అక్కడెవరో మనిషి పడివున్నారని గ్రహించారు వాళ్ళు.

"ఒసే లచ్చి అటు సూడే! అక్కడెవరో పడపోయినట్టు ఉన్నారు" అని అరిచింది పెద్దమ్మ. పెద్దమ్మ అందరికీ పెద్దమ్మే. ఆమెకి అరవై ఏళ్ళుంటాయి. ఆమెకంటే చిన్నవాళ్ళందర్నీ కన్నబిడ్డల్లా చూసుకుంటుంది. అందుచేత ఆమె అందరికీ పెద్దమ్మే.

లచ్చికూడా అటుకేసి చూసింది. అక్కడ ఉత్తిపాక్కాయే కాదు, ఆ పొక్కా తొడుక్కున్న మనిషి పడిపోయి ఉన్నాడని గమనించింది. "మనకెందుకే

నందిగం కృష్ణారావు



పెద్దమ్మా! ఆ మడిసి కాలు జారితే కాలవలో పడిపోయేడో, ఎవుడైనా తోసేస్తే పడిపోయాడోనే, ఆతన్ని గురించి పట్టించుకుంటే రేపొద్దున్న పోలీసు కేసులు తగులుకుంటాయే. అసలు మనం సూడనట్లే ఎల్లిపోదాం" అంది పెద్దమ్మ ఎక్కడ ఆ మనిషి సహాయంగా వెళ్ళాలంటుందోనని.

"ఒసోస్ ఎంతమాటన్నావె, నిన్ను కన్నప్పుడు ఇది ఉత్తి రక్తపు ముద్దేనని రేపొద్దున్న దీంతో కష్టాలెందుకని ఏ ఎట్లోకో ఇసిరేసి ఉంటే ఇవాళ నువు ఎక్కడ వుండేదానివి" అంది పెద్దమ్మ. దాంతో అక్కడ వున్న వాళ్ళందరి గుండెలూ పొంగాయి. గాయాల్తో పడిపోయిన మనిషి తమ బిడ్డేనన్నంత ఆదుర్దాపడ్డారు.

"రండి...రండి" అంటూ ఒకర్నొకరు పిల్చుకొంటూ రెల్లుపొదకేసి నడిచారు.

అతనిలో ఇంకా కొన ఊపిరేమైనా ఉందేమోనన్న ఆశతో ఆడవాళ్ళంతా కల్సి అతన్ని గట్టుమీదకి మోసుకొచ్చి పడుకోబెట్టారు.

పెద్దమ్మ తన పమిటతో అతని మొహం తుడిచింది. అతని ఒంటిమీద చొక్కా తీసి పిండింది. అతని ఒంటిమీద ఉన్న గాయాలు చూసి ఆడవాళ్ళంతా గుండెలమీద చేయి వేసుకున్నారు. "ఇన్ని గాయాల్తో ఇతను బ్రతికున్నాడంటే" కారణజన్ముడై ఉండాలి అంది పెద్దమ్మ. అతను నీళ్ళేమైనా మింగాడేమోనని అతని కడుపు ఒత్తి నీళ్ళు కక్కించాలనుకున్నారు. అలా చేస్తే అతని ఒంట్లో ఇంకా ఏమైనా రక్తం ఉంటే అది కాస్తా బయటికి వస్తుందేమోనని భయపడ్డారు. తడిచిన అతని చొక్కాతో అతని ఒంటిమీద ఉన్న గాయాలు తుడిచారు. "డాక్టర్ దగ్గరికి తీసుకెడితే భతుకుతాడేమో"నంది చాకలి ఈరమ్మ.

"డాక్టర్ దగ్గరకి తీసుకెళ్ళేలోగావే బాబు ప్రాణాలొదిలేస్తాడు. డాక్టర్నే ఇటు తీసుకురండి" అంది మంత్రసాని మనవరాలు.

"లగెత్తుకెళ్ళండెహె" అని తొందరచేసింది పెద్దమ్మ. ఇద్దరు ముగ్గురు ప్రైమరీ హెల్త్ సెంటర్‌కేసి పరిగెట్టారు.

అలాగ ఆ ఆడవాళ్ళ ద్వారా ఆ కబురు ఊరంతా పాకింది. ఎక్కడెక్కడున్న వాళ్ళూ పరుగెత్తుకొచ్చేరు.

కబురు తెలిసిన డాక్టర్ వెంకటేశ్వర్లు కూడా అక్కడికి హడావుడిగా వచ్చాడు. చేయి పట్టుకుని అతని నాడిని పరీక్షించేడు. స్టెత్ పెట్టి గుండె కొట్టుకొంటుందో లేదో చూశాడు. ఆ తరువాత పెదవి విరిచాడు.

చుట్టూ మూగినవాళ్ళకి అర్థం కాలేదు. "ఇతను బతుకుతాడా లేదా" అని అడిగేడు ఒక ముసలాయన.

"ఇతన్ని చంపేశారు" అని చెప్పాడు డాక్టర్.

అప్పుడు అందరూ ఒక్క క్షణంపాటు బిత్తరపోయారు. ఆ తరువాత ఆ శవంకేసి పరిశీలనగా చూశారు. అతనికి పట్టుమని పాతికేళ్ళు ఉండవు. వాజాగ్గా ఉన్నాడు. మొహం అమాయకంగా ఉంది. అతని వంటిమీద ఉన్న జీన్ ప్యాంటూ, షర్టు ముబట్టి చూస్తే చదువుకున్న వాళ్ళా ఉన్నాడు. అతని గడ్డం బాగా మాసిపోయి ఉంది. అలాగని అతను బద్ధకస్తుడిలా లేడు. మాసిన గడ్డంలో ఏదో పొందికా అందం ఉన్నాయి. అతను ఆలోచనల భారంతో గడ్డం చేసుకోవడం మరచిపోయిన వాళ్ళా ఉన్నాడు. ఇంతటి సుకుమారుని, ఇంతటి అమాయకుడిని, ఇంతటి బుద్ధిజీవిని చంపాల్సిన అవసరం ఎవడికైనా సరే ఎందుకు కలిగిందోనని వాళ్ళంతా ఆశ్చర్యపోయారు.



"ఇతన్ని తుపాకుల్తో కాల్చి చంపారు. ఇది మామూలు వాళ్ళు చేసిన పని కాదు. ఏ నక్సలైట్లో, పోలీసులో, మిలటరీ ఒళ్ళో చేసిన పనై ఉంటుంది" అని చెప్పేడు డాక్టర్.

అందరికీ గుబులు బయలుదేరింది. అంటే తమ చుట్టుప్రక్కల ఎక్కడో భీకరమైన యుద్ధం జరుగుతున్నట్లుంది. ఆ యుద్ధం అక్కడ్నించి పాకి పాకి తమ ఊరుమీదకి పెనుతుపానై విరుచుకుపడుతుందేమోననిపించింది. అయితే ఆ యుద్ధంలో ఈ బాబెవరై ఉంటాడు? అన్న ప్రశ్న వాళ్ళకి ఎదురైంది. అది గ్రహించినట్టుగా డాక్టర్ వెంకటేశ్వర్లు, నక్సలైట్లనే పోలీసులు ఇలాగ చిత్రహింసలు పెట్టి సంపుతున్నారు అన్నాడు.

ఇది వినగానే అక్కడున్న వాళ్ళ హృదయాలు ద్రవించాయి. అక్కడున్న వాళ్ళందరికీ ఆ శవం తమ తమ్ముడిలానో, అన్నలానో, కన్నకొడుకుదిలానో కనిపించింది. అందరి కళ్ళల్లోనూ నీళ్ళు తిరిగాయి.

"ఈ బాబునిప్పుడేటి సేద్దాం?" అని అడిగింది పెద్దమ్మ.

"మనూ, నేమూ సేసేదేటి? పోలీసోళ్ళకి కబురెడితే ఆళ్ళే వచ్చి చూసుకుంటారు" అన్నాడు అక్కడే ఉన్న మునసబు.

అలనాడెప్పుడో నీలమ్మ కూతురు కాలుజారి కాలవలో పడి చచ్చిపోయినప్పుడు పోలీసులొచ్చి చేసిన యాగీ అంతా ఇంతా కాదు. శవాన్ని నీళ్ళల్లోంచి తీయించారు. ఆ శవాన్ని ఎవర్నీ ముట్టుకోనివ్వలేదు. కన్న తల్లిదండ్రుల్ని కూడా శవం మీద పడి ఏడవనివ్వలేదు. ఊరందరూ చూస్తుండగానే డాక్టర్ని పిలిపించి కాలవ ఒడ్డునే బిడ్డకి పోస్టుమార్టం చేయించారు. అప్పుడా పోస్టుమార్టంని బలవంతంగా చూడాల్సి వచ్చిన నీలమ్మకి కన్న పేగునించి మంత్రసాని బిడ్డని వేరు చెయ్యడానికి బొడ్డు కోసినప్పుడు కలిగిన బాధకంటే ఎక్కువ బాధ కలిగింది. చూడలేక అందరి కళ్ళల్లోనూ నీళ్ళు తిరిగాయి.

బిడ్డపోయిన బాధకంటే నీలమ్మకి పోలీసోళ్ళు పెట్టిన బాధ ఎక్కువైంది.

ఇది గుర్తుకొచ్చి అక్కడున్న ఆడవాళ్ళంతా 'ఒద్దు... ఒద్దు పోలీసోళ్ళని పిలవద్దు" అన్నారు.

"...పిలవకుండా కదరదు! ఇది మామూలు కేసనుకొన్నారేటి? మర్డర్ కేసు. ఆడేటి? మీ అబ్బేపోడా? మీ అమ్మేపోడా? మీరింతలా ఇదైపోతున్నారు" అని కసురుకుని పోలీసులకి కబురెట్టడానికి చరచరా అక్కడ్నించి వెళ్ళిపోయాడు మునసబు.

అప్పుడెందుచేతో కానీ అక్కడంతా నిశ్శబ్దం అలుముకొంది. ఎప్పుడూ గలగలా శబ్దంచేస్తూ పారే కాలవలోని నీళ్ళు గడ్డ కట్టుకుపోయినట్లుంది. గట్టుమీద ఉన్న రావిచెట్టు పైన ఉంటున్న పక్షులన్నీ మౌనంగా ఉండిపోయాయి.

పరిస్థితేమిటో అర్థంకాక, అయోమయంగా చూస్తూ ఉండిపోయారు. ఎవరికా వాళ్ళు అక్కడ్నించి వెళ్ళిపోతే మంచిదికదాననుకొన్నారు. అలాగ చేస్తే శవం దిక్కులేనిదైపోతుందని దిగులుపడ్డారు.

అక్కడున్న కూలీ నాలీ తప్ప మిగిల్నవాళ్ళంతా వెళ్ళిపోయారు. "ఈ బాబెవరై ఉంటారో?" అని అడిగింది చాకలి లచ్చి.

పెద్దమ్మ కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. తను వయసులో ఉన్నప్పుడు తన ఇంటి ముందర ఉన్న మురికి గుంటలో ఒక పసిబిడ్డ శవం పడివుంది. అది చూసి తనమీద కన్నేసి ఉంచిన కంట్రాక్టర్ ఆ బిడ్డ తను కని పారేసిన బిడ్డేనని పుకారు పుట్టించాడు. అప్పటినించీ తనని ఎవరూ గౌరవంగా చూడలేదు. ఒకరితో చెడిన దానిని పదిమందితో చెడితే తప్పేమిటన్నట్లుగా చూశారు. దీంతో తనని పెళ్ళి చేసుకోవడానికి ఎవరూ ముందుకు రాలేదు. వయస్సు మీరిన తరువాత తను అందరికీ పెద్దమ్మే అయింది. ఇప్పుడు దిక్కులేకుండా పడివున్న ఈ బిడ్డని తన బిడ్డ అనుకుని తనకి ఒదిలెయ్యవచ్చును కదా? అప్పుడు ఈ బిడ్డ విషయంలో తను చెయ్యని తప్పకు తనకు ఏ శిక్ష వేసినా భరించడానికి తను సిద్ధంగానే ఉంది. పెళ్ళి పెటాకులు లేని గొడ్రాల్లా చచ్చే కంటే, దిక్కులేని వాళ్ళకి తల్లిలా ఉండిపోవడం మేలనిపించింది.

స్త్రీ సహజమై ఉండే "బిడ్డ తల్లి కావాలన్న" తపన ఆమెలో పొంగి పొర్లి ఆమె కళ్ళల్లోంచి కన్నీళ్ళై ప్రవహించింది.

మిగిల్న కూలీలంతా పెద్దమ్మ చుట్టూ మూగారు. "ఈ బాబు ఎవరైతేనేం? ఒక మనిషి యింకో మనిషికేమౌతాడో ఈ బాబు మనకదే అవుతాడు" అంది పెద్దమ్మ.

శవంమీద ఈగలు ముసురుతున్నాయి. వరి చేలమీదనించి సన్నగా వస్తున్న పైరగాలికి ఈగలు శవంమీద గాయాలనుంచి తమ స్థానాన్ని మార్చుకుంటున్నాయి తప్ప శవాన్ని ఒదిలివెళ్ళడం లేదు.

"ఛీ.. పాడు ఈగలు" అంటూ కొంగుతో ఈగల్ని పారద్రోలింది పెద్దమ్మ.


అంతా శవం చుట్టూ కూర్చుని శవంమీద ఈగలు వాలకుండా విసరసాగారు.

పొలం పనులు ప్రక్కన పెట్టినందుకు కోటిరెడ్డి దొరగారి పాలేరుకి విసుగ్గా ఉంది. "ఏంటి లంజల్లారా! పనికి రారా" అని అరిచాడు.

"రాకేటి సేస్తాం. ముందు ఈ బాబు సంగతేటో తేలనివ్వండి" అని చెప్పారు వాళ్ళు.

దిక్కుమాల్న శవానికి, యీళ్ళకి ఉన్న సంబంధం ఏటో అతనికర్థం కాలేదు. ఎందుకైనా మంచిదని పరిగెత్తుకెళ్ళి ఆ విషయాన్ని కోటిరెడ్డిగార్కి చెప్పాడు. కోటిరెడ్డిగారు ఆలోచనలో పడ్డారు.

కోటిరెడ్డిగారు ఆ ఊళ్ళోకల్లా పెద్దరైతు. ఆ ఊరు ఒక సంస్థానమైతే ఆ సంస్థానానికి ఆయన జమీందారు. ఆయన మాటకెదురు లేదు. ఆ ఊళ్ళో తగవులన్నింటికీ ఆయనే తీర్పు చెప్పాలి. ఆయన కుక్కని చూపించి "ఇది కుక్క కాదు నక్క" అంటే "అవునయ్యా ఇది నక్కే"నని ఒప్పుకోవాలి. కాదన్నాడు ఇంతవరకూ ఎవరూ లేరు. ఆయన్ని కాదంటే కూలీలకి కూలీ దొరకదు. బ్రతుకు బజార్లో పడుతుంది. అందుచేత ఎవరూ ఆయన్ని కాదనరు. ఊర్లోకి అధికార్లెవరు వచ్చినా ముందాయన్ని దర్శించకుండా ఉండరు. రాజకీయ నాయకులొస్తే ఆయనింట్లోనే బస. అందుచేత ఆ ఊరుకి సంబంధించినంతవరకూ ఆయనిల్లు




వచ్చేవారం

అల్లం రాజయ్య

(పెద్ద కథ)

ప్రత్యర్థులు

గవర్నమెంట్ హెడ్ ఆఫీస్‌లా ఉండేది.

ఆయన అలా ఆలోచనలో ఉండగానే టౌన్‌నించి పోలీసులొచ్చారు. జీప్ దిగగానే ఇన్‌స్పెక్టర్ లతీఫ్ ఉద్దీన్ "నమస్తే సాబ్" అన్నాడు. అలాగని చేతు లెత్తి అతను నమస్కారం చెయ్యలేదు. నోటితోటే అన్నాడు.

వరండాలో పడక్కుర్చీలో ఎదురుగా ఉన్న స్టూల్ మీద కాళ్ళు పెట్టుకూర్చున్న కోటిరెడ్డిగారు. ఎందు చేతో అంత గంభీరంగా కనిపించలేదు. కంట్లలో నలకపడ్డ పులిలా ఉన్నారు. అందుచేత పోలీసోడికి కాస్తంత లోకువగా కనిపించాడు.

"నమస్తే... నమస్తే.. మీ కోసమే చూస్తుండాను రా కూర్చో" అన్నాడు కోటిరెడ్డి.

"కూర్చోడానికి టైం లేదు. అక్కడ శవం ఉంది. చీకటి పడకముందే పంచనామా చెయ్యాలి. పని అయ్యేసరికి చీకటి పడుతుంది. భోజనానికి ఇక్కడే ఉంటాంలే" అన్నాడు లతీఫ్ ఉద్దీన్.

"చచ్చినోడు నక్సలైట్ కాదు కదా?"నని సందేహం వెలిబుచ్చాడు కోటిరెడ్డి.

"వాటు కోడ్ని తిని పాన్నాళ్ళైంది" అని చెప్పి తిరిగి జీప్ ఎక్కాడు ఇన్‌స్పెక్టర్.

పోలీస్ జీప్ కదిలింది.

దిక్కుమాల్నోడి సావు తన మీదకొచ్చి పడిన ట్లనిపించింది కోటిరెడ్డికి. పోలీసోళ్ళ భోజనాలకి ఏర్పాటుచెయ్యమని గుమస్తాకి చెప్పి పాలేర్నింటపె ట్టుకుని బయలుదేరాడు కోటిరెడ్డి.

శవాన్ని చూడగానే ఇన్‌స్పెక్టర్‌కి అది తెల్లారు జామున గోదావరికివతల ఉన్న అడవిలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో గాయపడ్డ రవీంద్రదని అర్థమైంది. అలాగ గాయపడ్డవాడు యీ ఊళ్ళోకెట్లా వచ్చి చనిపోయాడన్నది అతనికి అర్థం కాలేదు. ఆలో చిస్తూనే అక్కడ మూగిన జనాన్ని ఒక పక్కకి జరగమని ఆదేశించాడు.

జనమంతా కాలవ ఒడ్డున ఉన్న మర్రిచెట్టు క్రిందకి వచ్చి నిల్చున్నారు.

శవ పంచనామా జరుగుతున్నప్పుడు కోటిరెడ్డి అక్కడికొచ్చాడు. శవాన్ని పరిశీలనగా చూశాడు. ఆ మనిషినతడు ఆ ఊళ్ళో ఎప్పుడూ చూసి నట్లనిపించలేదు. కరణాన్ని, మునసబుల్నడిగాడు "మీరెప్పుడైనా ఈ మనిషిని చూశారా"నని.

"లేదు.. లేదు" అన్నారు వాళ్ళు.

ఈ మనిషికీ వీళ్ళకీ సంబంధం లేకపోతే ఆళ్ళు ఎందుకింత ఇదైపోతున్నారో అతనికంతుపట్టలేదు.

ఇన్‌స్పెక్టర్ లతీఫ్ ఉద్దీన్ వైర్‌లెస్‌లో పై అధికా రులతో మాట్లాడి శవానికి డాక్టర్ వెంకటేశ్వర్లు చేత అక్కడికక్కడే పోస్టుమార్టం చేయించాడు.

అది చూసిన అందరి కడుపుల్లోనూ తిప్పింది. కోటిరెడ్డి ప్రక్కకి వెళ్ళి డోక్కొన్నాడు. కూలీల కళ్ళమ్మట నీళ్ళు తిరిగాయి.

"ఏయమ్మ గన్నబిడ్డో..."నంది లచ్చి.

పెద్దమ్మ కడుపులోంచి దుఃఖం తన్నుకువచ్చి శోకరూపం దాల్చింది.

ఆ బాధ పెనుతుపానై విరుచుకుపడి తమని కబళిస్తుందేమోనని భయపడ్డారు కోటిరెడ్డి, సెట్టి సుబ్బయ్య, కరణం మునసబులు. ఒకరి మొహాలొ కరు చూసుకుని మొహాల్తోటే మాట్లాడుకున్నారు.

వాళ్ళకి మనిషికి మనిషికీ ఉన్న సంబంధం ఏమిటో. మనుషులకీ బాధతో ఏర్పడే అనుబంధం ఎలాటిదో అర్థం కాలేదు. అందుచేత ఆ చచ్చిన వాడికీ వాళ్ళకీ ఏదో బలమైన సంబంధం ఉందన్న నిర్ధారణకి వచ్చారు. సరిగ్గా అలాంటి నిర్ణయానికే పోలీసులు కూడా వచ్చారు.

పోస్టుమార్టం అయిన తరువాత "ఈ శవం తాలూకు వాళ్ళెవరైనా ఉన్నారా" అని అడిగాడు ఇన్‌స్పెక్టర్.

ఎవరూ మాట్లాడలేదు. మేం ఉన్నామంటూ ఎవరూ ముందుకు కూడా రాలేదు.

"అయితే ఈ శవాన్ని మేమే తగలేస్తాం" అన్నాడు ఇన్‌స్పెక్టర్.

"నేమున్నాను" అంటూ ఆవేశంగా కళ్ళు తుడు చుకుని ముందుకు వచ్చింది పెద్దమ్మ.

ఇన్‌స్పెక్టర్ లతీఫ్ ఉద్దీన్‌తో సహా అందరూ ఒక్కసారి ఖంగుతిన్నారు.

సందేహం లేదు ఈ ఊళ్ళోవాళ్ళకి నక్సలైట్లతో సంబంధం ఉంది అనుకున్నాడు.

"అయితే నీకు నక్సలైట్లతో సంబంధం ఉందన్న మాట" అన్నాడు సందేహిస్తున్నట్లుగా.

"అయ్యా ఆ బాబెవరోమాకు తెలవదు. ఇంతకు ముందర మేం ఎప్పుడూ ఆ బాబుని చూసెరగం. సాటి మనిషి కాబట్టి ఆ మనిషిని దిక్కులేనో శవం సెయ్యడం పెద్దమ్మకిష్టంలేదు. కనుక దానం సెయ్యడానికి ముందుకొచ్చింది" అని చెప్పింది మంత్రసాని.

"సంబంధం ఉందో లేదో తేల్చడానికి మాతో పట్నానికి తీసుకెళ్ళాలి" అని పెద్దమ్మని వ్యాన్ ఎక్కించాడు ఇన్‌స్పెక్టర్.

రవీంద్ర శవాన్ని కూడా పట్నం తీసుకువెళ్ళారు. ఆ తరువాత దాన్ని ఏం చేశారో ఎవరికీ తెలవదు. పెద్దమ్మని ఇంటరాగేషన్ పేరిట రోజుల తరబడి ఎవరికీ కనిపించనివ్వకుండా చేశారు.


చివరికి కూలీలంతా కోటిరెడ్డిని నిలేశారు. ఎలా గైనా పెద్దమ్మని ఇడిపించుకు తీసుకురమ్మని బ్రతి మాలారు. పనులకి వెళ్ళడం మానేసి తిండి తిప్పలు లేకుండా అతని ఇంటిముందే పడి ఉన్నారు.

వాళ్ళ ధోరణి చూసి కోటిరెడ్డి భయపడ్డాడు. వాళ్ళ వెనక ఏదో బలమైన శక్తి ఉందనుకొన్నాడు.

సెట్టి సుబ్బయ్య పెద్దమ్మని ఇడిపించడానికయ్యే ఖర్చు తానే పెట్టుకుంటానని ముందుకు వచ్చాడు. ఆకలితో చచ్చిపోతున్నా ఎంగిలిచెయ్యి విసరడానికి వెరసే సెట్టిలో అంత మార్పు రావడం అందరికీ ఆశ్చర్యం కలిగించింది.

"బంజరు భూములు దున్నుకోండి మీ పేరు మీద పట్టాలిప్పిస్తారు" అంటూ స్వయంగా అర్జీలు

తరువాయి 75వ పేజీలో



**శ్రీ**సీతారామయ్యగారి మనవరాలు' సినిమాలో తన నటనతో యువకుల కలలరాణి అయిన నటి మీనా ఇటీవల రెండు వారాలపాటు చైనాలో హాలిడే పర్యటన ముగించుకుని వచ్చింది. సినిమా షూటింగ్స్‌తో బిజీగా వుండా ల్సిన మీన ప్రస్తుతం పెళ్లికోసం కంచీ పురం పట్టుచీరలు కొనడంలో నిమ గ్నమై ఉందని చెన్నైలో గుసగుసలు వినిపిస్తున్నాయి. డైరెక్టర్ సేరన్‌ను పెళ్లి చేసుకుంటుందని విన్పిస్తున్న ఈ వార్త విషయమై మీనాను అడిగినప్పుడు 'జీవి తంలో తాను సాధించాల్సింది ఇంకా చాల వుందని, ఇప్పట్లో పెళ్లి చేసుకుని పిల్లల్ని కనే ఉద్దేశ్యం లేదని ' అంటోంది. లోగట్టు సేరన్ కెరుక!!

అతి త్వరలో
'చక్కిలి గింతలు'
హాస్యరసోపాఖ్యానం
'లవ్ మాస్టర్'

9వ పేజీ తరువాయి

తయారుచేసి కూలీల్తో సంతకాలు పెట్టించుకున్నాడు కరణం. అంతకుముందు అతనెప్పుడూ కూలీలకి, పెద్ద రైతులకి మధ్యన చిన్న చిన్న తగాదాలు వస్తే రైతులపక్షమే మాట్లాడేవాడు.

"నక్సలైట్ల విషయంలో పోలీసులు తన మాట వినరు" అని చెప్పాడు కోటిరెడ్డి.

"పెద్దమ్మ ఎవరో మీకు తెలవదా"నన్నారు కూలీలు.

ఎర్రిముండకి నిజంగా నక్సలైట్లతో సంబంధం ఉండి ఉంటుందా?నని ఆలోచించాడు. ఏ పుట్టలో ఏ పాముంటుందో మనకేటి తెలుసునని సరిపెట్టుకున్నాడు. ఇన్నాళ్ళనించీ లేంది ఈ మూకకి ఇప్పుడు తన ముందుకొచ్చి తనని నిలేసే ధైర్యం ఎలాగొచ్చిందని సందేహించాడు. పెద్దమ్మకే కాదు ఈళ్ళకి కూడా కాస్తోకూస్తో నక్సలైట్లతో సంబంధాలు ఉండి ఉంటాయన్న నిర్ధారణకొచ్చాడు.

రోజులు మారిపోతున్నాయి. ఊళ్ళు మారిపోతున్నాయి. మనుషులు మారిపోతున్నారు. మరలాంటప్పుడు ఎవర్నీ నమ్మడానికి వీల్లేదు అనుకున్నాడు కోటిరెడ్డి.

"తెలవకేటి.. తెలుసుకానీ యిందులో నేను చెయ్యగలిగిందేమిటి?" అన్నాడు కోటిరెడ్డి.

"పెద్ద పెద్ద కేసులు మాఫీ చేయించిన మీకు, ఉత్తిపుణ్యానికి పట్టుకెళ్ళిన పెద్దమ్మని ఇడిపించడం ఒక లెక్క కాదు" అన్నారు వాళ్ళు.

"అలాగే చూద్దాం" అని లేచి లోపలికెళ్ళాడు కోటిరెడ్డి.

కోటిరెడ్డికి తెలిసినంతవరకూ గోదావరికవతల నక్సలైట్లు భూస్వాముల్నించి భూములు లాక్కొని పేదలకి పంచుతున్నారు. కాదంటే భూస్వాముల్ని చంపేస్తున్నారు. రవీంద్ర శవం తమ ఊళ్ళో దొరకడాన్ని బట్టి చూస్తే ఈ ఊళ్ళో వాళ్ళకి కూడా నక్సలైట్లతో సంబంధం ఉందనిపిస్తోంది. తనమీద ఊళ్ళో ఉన్న రైతులకి కోపం ఉండటానికి సవాలక్ష కారణాలు ఉన్నాయి. మరలాంటప్పుడు సీకట్లో శత్రువుల్తో పోరాడ్డం కుదరదు. అందుచేత ఊరొదిలి ఎళ్ళిపోవడం శ్రేయస్కరం అనుకున్నాడు. ఆ రాత్రికి రాత్రి మూట కట్టుకోగలిగినన్ని వస్తువుల్ని మూటగట్టుకుని ఊరొదిలిపెట్టి వెళ్ళిపోయాడు కోటిరెడ్డి.

పెద్దమ్మనించి సమాచారం ఏమీ రాబట్టుకోలేని పోలీసులు ఆ మర్నాడే ఆమెని వదిలేశారు.

ఊరంత సంబరంగ పండగ సేసుకొన్నారు. పెద్దమ్మ అప్పుడు చెప్పింది, "ఆ చనిపోయినతని పేరు రవీంద్ర అట. అతనికీ నాకూ ఉన్న సంబంధం ఏమిటి? అని పోలీసులు నన్ను శానా ఇబ్బంది పెట్టారు" అని. ఆ తరువాత పెద్దమ్మకి ఆ బిడ్డతో ఉన్న హృదయ సంబంధం కట్టు తెంచుకుని కన్నీళ్ళై ప్రవహించాయి.

"ఇంతకీ ఆ బాబు ఎవరై ఉంటాడు" అని అడిగింది సీతమ్మ.

"ఎవరైతేనేం ఆ బాబు ఒక వీరుడు. చచ్చి కూడా మనకి మేలు చేశాడు. ఆ బాబుని మనం మరిచిపోవద్దు" అంది పెద్దమ్మ.

ఆ తరువాత అంతా కలిసి రవీంద్రకి విగ్రహం చేయించి ఆ ఊరి మధ్యన ప్రతిష్ఠించారు.

అప్పట్నుంచీ రవీంద్ర విగ్రహం ఎవర్నీ తప్పు చెయ్యకుండా చూస్తోంది. దుర్మార్గాన్ని, దౌర్జన్యాన్ని ఊరి బయటకు తరిమికొట్టింది.

రవీంద్రకి ఆ ఊరికి ఉన్న సంబంధం తెలుసుకోవడానికి కూడా పోలీసులు ఊళ్ళోకి నాలు రావడానికి జడిశారు. రవీంద్ర కళ్ళతో ఊళ్ళో వాళ్ళెక్కడ తమని చూస్తారోనన్న భయం వాళ్ళని పీడించింది. అందుచేత ఒకరోజు రాత్రిపూట వాళ్ళు గ్రామం మీద దాడిచేశారు.

"అన్నా మమ్మల్ని కాపాడు!"

"బిడ్డా మమ్మల్ని కాపాడు!" అంటూ జనం నినుగెత్తి అరిచారు. పోలీసుల గుండెల్లో రవీంద్ర విగ్రహం పగిలింది. అందులోంచి శతకోటి రవీంద్రలు బయటికి వచ్చారు.

దారీతెన్నూ వదిలేసి తలా ఒక దిక్కుకు పరిగెట్టారు.

దెయ్యాల పీడా విరగడ చేసినందుకు జనం రవీంద్ర విగ్రహానికి మొక్కారు.

అప్పటినించీ రవీంద్ర ఆ ఊరికి ఆరాధ్యదైవం అయ్యాడు.

■■



డేంజరస్

వివాహం అయింది. ఇంక మీరు లైఫును ఇన్సూర్ చేయాలి అన్నాడు ఏజెంట్.

ఫర్వాలేదు లేవయ్యా. మా ఆవిడ అంత డేంజరస్ మనిషేం కాదు అన్నాడు. బాలాజీ.

—కాట్రగడ్డ వెంకట్రావు

# స్వప్నచింత

మనసు పొరల్లో
ఊటలా పుట్టిన అనుభవాలు
కలల సముద్రాల మీద
అలలుగా దొర్లుతాయి...
బతుకు కాఠిన్యం అడవిలా రూపాంతరం చెందినపుడు
టేకుటాకుల మీద వెన్నెలపాలు వొలికినపుడు
పిల్లతెమ్మెర వీచికల్తో నిద్రలోయల్లోకి జారినపుడు
కలగనడం వొక వింత అనుభూతి...
కుబుసం విడిచిన నల్లతాచుల్లాంటి భీకర రాత్రుల్లో మంచుచీరెలు ధరించి
చలినన్నావరించినపుడు
నిద్ర వరించక నాలాంటి ఎందరో
గజగజ వణుకుతూ మంచుశిలలౌతున్నపుడు చిట్లిపోయే కలతెగిన రాగమే...
పట్టని నిద్ర కోసం ఫోం బెడ్డుల్లో పరితపించే
నల్లధన స్వాములకు నిద్ర ఖరీదైన వస్తువే
కల అందని ద్రాక్షపండే...
పిడికెడన్నం కోసం చెమట నదుల్లో ఈదులాడే శ్రామికుడికి
నిద్ర వడ్డించిన విస్తరే.
కల రంగుల కలే...
నిద్రలేమి
కలదారిద్ర్యం
మానసిక దౌర్బల్యమే
కలల రీతులెన్నయినా స్థూలంగా కలకలే-
మనో వైజ్ఞానికులకింకా
కల అంతుచిక్కని రహస్యమే-
కల్లోల సమాజంలో కలలు చిత్ర విచిత్రమే-
ఆరోగ్యమైన అందమైన మనసులో
కలసౌభాగ్యం అమృతప్రాయం.

దామెర రాములు